క్లుప్తంగా

నేడు మండల సమావేశం

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న మరమ్మతు పనులు

సీతానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం మరమ్మతులు చేపట్టినట్టు ఏఈ జగన్ మోహన్ తెలిపారు. మండల కేంద్రంలోని అప్పయ్యపేట నుంచి వచ్చే ఫీడర్ మరమ్మతులకు గురవడంతో సబ్‌స్టేషన్‌లో పనులు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎల్‌టీ లైన్లు మరమ్మతులు చేపట్టామన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం అవసరమైన చర్యలు చేపట్టామన్నారు.

విద్యార్థికి నగదు ప్రోత్సాహకం



సందీప్‌కు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

గరుగుబిల్లి: పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దూసి సందీప్‌కు వైస్ ఎంపీపీ ఎస్.లక్ష్మి దంపతులు ప్రోత్సాహక బహుమతి కింద రూ.5 వేలను శుక్రవారం అందజేశారు. ఈ నగదుతో పాటు అతడి ఇంటర్మీడియట్ చదువు నిమిత్తం వారు అందించిన మరో రూ.7,500లను ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు చేతులమీదుగా సదరు విద్యార్థికి అందించారు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇచ్చిన మాట ప్రకారం వారు ఈ సాయం చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కె.భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వసతిగృహం ఏర్పాటు



సూచనలిస్తున్న ఐటీడీఏ పీఓ వెంకటరమణ

సీతంపేట: స్థానిక వైటీసీలో గర్భిణులకు త్వరితగతిన వసతిగృహం ఏర్పాటు చేయాలని ఐటీడీఏ పీఓ వి. వెంకటరమణ అన్నారు. ఈ మేరకు వసతిగృహం పనులను శుక్రవారం పరిశీలించి, వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వడానికి ఏయే గదులు అనుకూలంగా ఉన్నాయో పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, డిప్యూటీ ఈఓ నారాయుడు, ఏఎంఓ కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు పాల్గొన్నారు.

పరిశీలన



ఓపెన్ హెడ్ చానల్ వద్ద పరిశీలనకు వచ్చిన అధికారులు

భామిని: వంశధార ప్రాజెక్ట్‌లో భాగమైన ఓపెన్ హెడ్ చానల్‌ను నార్త్ కోస్ట్ చీఫ్ ఇంజినీర్ సుగుణాకరరావు శుక్రవారం పరిశీలించారు. మండలంలోని కాట్రగడ–బి వద్ద వంశధార నదిపై నిర్మించిన ఓపెన్ హెడ్ చానల్‌ను వంశధార ఎస్ఈ రాంబాబుతో కలిసి తిలకించారు. ప్రస్తుతం వంశధారలో ఆరు వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవహిస్తుండగా ఓపెన్ హెడ్ చానల్‌లోకి వెయ్యి క్యూసెక్కుల వరద నీరు ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న పూడికల తొలగింపుపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట వంశధార ఈఈ రామచంద్రరావు, డీఈఈ భవానీశంకర్, ఏఈలున్నారు.

19న వర్క్‌షాప్

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన సామాజిక భవనంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్(చట్టం)పై ఈ నెల 19వ తేదీన వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు సామాజిక చైతన్య వేదిక ఉత్తరాంధ్ర కన్వీనర్ పి.రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చట్టిబాబు, న్యాయవాది రమేష్‌రాజ్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు హాజరై, చట్టంపై అవగాహన కల్పిస్తారన్నారు.

శ్రావణ శోభ

శ్రావణ మాసం రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అంతటా శ్రావణ శోభ నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. పలుచోట్ల అమ్మవార్ల ఆలయాల్లో కుంకుమార్చనలు జరిగాయి. కొన్ని ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం టౌన్: ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మవారు



పార్వతీపురం టౌన్: అమ్మవారికి కలశ పూజ



సీతానగరం : సామూహిక వరలక్ష్మీ పూజల్లో పాల్గొన్న మహిళలు



బలిజిపేట: అజ్జాడ శ్రీ విజయదుర్గా భవాని ఆలయంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు



పార్వతీపురం టౌన్: అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు



పార్వతీపురం టౌన్: ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఎస్ఎంసీ ఎన్నికపై విచారణకు డిమాండ్

పార్వతీపురం టౌన్: ఆదర్శ పాఠశాలలో ఇటీవల జరిగిన ఎస్ఎంసీ ఎన్నికపై విచారణ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ ఎన్నికపై విచారణ చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలుమార్లు ప్రజా సమస్య వేదికల్లో విద్యార్థుల సమస్యలపై తెలియజేసినా పట్టించుకోవడం లేదన్నారు. ములక్కాయవలస మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.స్వర్ణలతను సస్పెండ్ చేస్తూ ఆర్‌జేడీ ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఎస్ఎంసీ ఎన్నికలు రాజకీయాలకతీతంగా జరగాల్సి ఉండగా అలా జరగలేదన్నారు. జిల్లాలో నెలకొన్న విద్యార్థుల సమస్యలపై అధికారులు స్పందించాలని లేకుంటే ఆందోళన చేస్తామన్నారు. సంఘ మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బలిజిపేట: మండలంలో పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు ఏఈ సింహాచలం శుక్రవారం తెలిపారు. పిరిడి – బలిజిపేట మధ్య విద్యుత్ లైన్లలో చెట్ల నరికివేత, విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నందున చిలకలపల్లి, వంతరాం సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పార్వతీపురంలో..

పార్వతీపురం టౌన్: పట్టణంలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ వీవీ కిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 11 కేవీ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. పట్టణంలోని ఇందిరా కాలనీ, రావాపురం కాలనీ, గాంధీనగర్, దేవీనగర్, పార్వతీనగర్, చినకుమ్మరివీధి, రెడ్డి వీధి, నాయుడు వీధి, వేమకోటవీధి, పండా వీధి, కుసుమగుడి వీధి, కంచర వీధి, గొడువాధి, బేరి వీధి, కొనర వీధి, పిల్లా వీధి, హరిజనవీధి, కృష్ణపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్ అక్రమం



మోడల్ పాఠశాల వద్ద ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన

మక్కువ: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా సమస్య వేదికలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోని అధికార యంత్రాంగం మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఫిర్యాదుపై శరవేగంగా చర్యలు తీసుకోవడం అక్రమమని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ పేర్కొన్నారు. ములక్కాయవలస మోడల్ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ స్వర్ణలత సస్పెండ్‌ను నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఇటీవల ఎస్ఎంసీ ఎన్నికల్లో పలు అక్రమాలు జరిగినా పట్టించుకోని అధికారులు ప్రిన్సిపాల్ సస్పెన్షన్ విషయంలో తక్షణ చర్యలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా రాజకీయ లబ్ధి కోసమే ఈ సస్పెన్షన్ చేశారని ఆరోపించారు. ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్‌ను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లాలో పలు వసతిగృహాల్లో విద్యార్థులు పలు సమస్యలతో సతమతవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని లేకుంటే చలో కలెక్టరేట్ చేపడతామని హెచ్చరించారు.

భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకుడు మన్మథరావు

పార్వతీపురం టౌన్: శివ్వాం దళితులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకుడు యమ్మల మన్మథరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ఆవరణలో దీనికి సంబంధించి నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు ఆయన శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికి 32 రోజులుగా దీక్షలు జరుగుతున్నాయని, ఏళ్ల తరబడి సాగు చేస్తున్న శివ్వాం దళితులు భూ సమస్యను నేటికీ పరిష్కరించడంతో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఇది సరికాదన్నారు. దళితులపై పెత్తందారులు దాడులు చేస్తున్నా అధికారులు, పట్టించుకోవడం లేదన్నారు.

శివ్వాం దళితులపై దాడి చేసిన పెత్తందారులపై కేసులు నమోదు చేసి వారి భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బలిజిపేట మండలం నాయకులు శంకరరావు, ఫకీరు, వెన్నెల కృష్ణ, గుల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

17, 19 తేదీలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

బలిజిపేట: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఈ నెల 17, 19 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఎంఈఓ 1 సామల సింహాచలం శుక్రవారం తెలిపారు. నిర్దేశించిన ఉపాధ్యాయులు సమావేశాలకు హాజరు కావాలని సూచించారు. ఎస్ఎంసీ ఎన్నికలు జరిపే పాఠశాలలకు సంబంధించి ఈ సమావేశాలు ఎప్పుడు నిర్వహించేది తదుపరి ఆదేశాలు వచ్చాక తెలియజేస్తామని తెలిపారు.

ముంపు సమస్యను పరిష్కరించాలి



ఆక్రమణలు పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం టౌన్: పట్టణంలో నెల్లిచెరువు గట్టు, వరహాల గెడ్డతో పాటు పలు బందలలో ఉన్న ఆక్రమణలు తొలగించి పట్టణాన్ని ముంపు భారీ నుండి రక్షించాలని సీపీఎం పార్టీ నాయకులు రెడ్డి వేణు కోరారు. పట్టణంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాలలో ఉన్న కాలనీలు జలమయం కావడంతో శుక్రవారం ఆయా ప్రాంతాలలో పార్టీ సభ్యులు, నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలోని శివారు కాలనీలలో లేఅవుట్లు వేసిన సంబంధిత యజమానులు కాలువలను సక్రమంగా నిర్మించలేదన్నారు. ఆ కాలువలలో పూడికలు పేరుకు పోయాయని, దాని వలన వర్షం నీరు, వాడుకు నీరు పోయేందుకు అవకాశం లేకుండా పోయి రోడ్లపైనే నీరు ప్రవహిస్తుందన్నారు. పూడికలు తొలగించాలని, గెడ్డలలో, చెరువులలో, బందలలో ఎక్కడికక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయన్నారు. ఆ ఆక్రమణలను తొలగించాలని, వరహాల గెడ్డ ప్రవహించే ప్రాంతమైన వీరభద్ర థియేటర్ వద్ద కర్షక మహర్షి ఆస్పత్రి ఏరియాలో ఉన్న గెడ్డలో కల్వర్టు నిర్మాణం చేసేందుకు ఫిల్లర్లు నిర్మించారన్నారు. దీని కారణంగా వర్షపు నీరు ప్రవహించడం లేదని, గెడ్డలో పూడికలు పేరుకుపోయి వర్షపు నీరు, మురుగునీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా మట్టి దిబ్బలు పేరుకు పోయి ఉన్నాయని పూడికలను పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. ఆయన వెంట గొర్లి వెంకటరమణ, బొంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరరావులు తదితరులు ఉన్నారు.

ఇలాగైతే... ఎలా...

- జ్యోతిబాపూలే వసతిగృహం వద్ద నిలిచిపోయిన నీరు
- రాకపోకలకు అవస్థలు
- నిత్యావసర సరుకులు సైతం తీసుకురాలేని వైనం



జ్యోతిబా పూలే బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలో చేరిన వర్షపు నీరు

పార్వతీపురం టౌన్:

పట్టణ శివారులో ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలికల సంక్షేమ వసతిగృహం వద్ద గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గెడ్డ ఉప్పొంగి వరద నీరు చేరి వసతిగృహంలోకి చొచ్చుకువచ్చింది. దీంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. నిత్యావసర సరుకులు సైతం తీసుకువచ్చేందుకు ఇబ్బందులు నెలకొనడంతో విద్యార్థుల భోజనాలకు సైతం అవస్థలు తప్పలేదు. ఇదిలా ఉండగా జ్యోతిబాపూలే హైస్కూల్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రాజు, డి.పండు మాట్లాడుతూ ఈ సమస్యకు తక్షణమే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రహరీ లేకపోవడంతో స్కూల్ ఆవరణలోకి వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. దీని కారణంగా విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని జరగరానికి జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. గేటు బయట నుంచి స్కూల్ గదుల వరకు వరద నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు.

స్కూల్ ఆవరణలో ప్రార్థన సైతం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వంట గది చుట్టూ నీరు నిలిచిపోయి వంటలు చేసేందుకు సైతం ఇబ్బంది పడుతున్నారన్నారు. తక్షణమే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని అన్నారు. సందర్శించిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు హెచ్.సింహాచలం, మండల కమిటీ సభ్యులు వి.చంటి, కె.శ్రీను, కె.రాజేష్, పి.వెంకీ తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

విద్యార్థులను ప్రోత్సహించాలి

- ఎంపీటీసీ సభ్యురాలు హైమావతి



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుల వైపు ప్రోత్సహించాలని ఎంపీటీసీ సభ్యురాలు పాండ్రంకి హైమావతి అన్నారు. మండంలోని పాట్లి పాఠశాలకు చెందిన శంభాన హని జవహర్ నవోదయకు ఎంపిక కావడంతో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఒక లక్ష్యంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం పుష్పనాథం, సర్పంచ్ జి.కృష్ణారావు, పి.వెంకటనాయుడు, స్కూల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జి.భాస్కరావు, జి.శంకరరావు, శ్రీనివాసరావు, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త




మూడు రోడ్ల కూడలి వద్ద పేరుకుపోయిన చెత్త

పాలకొండ రూరల్: పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిత్యం ఉపన్యాసాలు ఇచ్చే అధికారులు ఆ ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదీ, లేనిదీ ఆరా తీయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కోటమటిపేట, కొత్తవీధి, గొల్లవీధులను కలిపే ప్రధాన మూడురోడ్ల కూడలి వద్ద చెత్తను డంప్ చేయిస్తున్న అధికారులు వాటిని సకాలంలో తరలించేందుకు చర్యలు చేపట్టడం లేదు.

దీంతో ఈ వ్యర్థాలను మూగజీవాలు, కుక్కలు చిందరవందర చేయడంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.

గురండిలో 'పొలంబడి'



పొలంలో వరినాట్లపై అవగాహన కల్పిస్తున్న ఏఓ, తదితరులు

భామిని : మండలంలోని గురండిలో మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం పర్యవేక్షణలో జీఏపీ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాన్ని పరిశీలించి చదరపు మీటర్‌కు 33 వరి కుదుళ్లు ఉండేలా నాట్లు వేయాలని ఏఓ సింహాచలం సూచించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. మొదటి దఫా ఎరువుగా 50 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను కలిపి వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఏపీ ఫీల్డ్ ఆఫీసర్ కె.ఈశ్వర్, ఆడిటర్ ఎన్.దినేష్, వీఏఏ ఎ.నిఖిల్, రైతులు సతీష్, శంకర్, అశోక్, మిన్నారావు, మహేష్ పాల్గొన్నారు.

పీఓగా ఐఏఎస్ అధికారిని నియమించాలి

సీతంపేట: ఐటీడీఏ పీఓగా ఐఏఎస్ అధికారిని నియమించాలని గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ ముఖద్వారం ధర్నా చేశారు. గ్రూప్ వన్ అధికారులను నియమించడం వల్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలులో పూర్తిస్థాయి నిర్ణయాలు తీసుకోలేరన్నారు. కార్యక్రమంలో ప్రజాసమాఖ్య ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు సవర చిరంజీవులు, జిల్లా అధ్యక్షుడు ఎస్.మోహన్‌పాల్, జేఏసీ ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, ట్రైబల్ డవలప్‌మెంట్ మిషన్ కార్యదర్శి విశ్వనాథం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఉచిత స్వల్పకాలిక కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసిన వారికి జనరల్ ప్లంబర్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 79937 95796 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

ఊరటనిచ్చిన వర్షం



పట్టణంలో కురుస్తున్న వర్షం

పాలకొండ రూరల్: మండల పరిధిలో శుక్రవారం వర్షం కురవడంతో కొద్ది రోజులుగా ఉక్కబోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఊరట చెందారు. అలాగే ఖరీఫ్ వరి పంటకు ఈ వర్షం ఎంతో ఉపయోగమని రైతులు చెబుతున్నారు. వర్షంతో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.